RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 201 Vol: 201 | ఆగస్టు 21 శుక్రవారం 2026 August 21 Fryday2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి: 'వీర్‌భూమి' వద్ద సోనియా కుటుంబం, ప్రధాని మోదీ నివాళులు

2

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

**సౌత్‌జోనల్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**మహాబలిపురం జనసంఘర్షణ**
కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న ప్రతిష్ఠంభనలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి (సౌత్ జోనల్ కౌన్సిల్) సమావేశంలో ఆయన తెలంగాణ ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా ఆవిష్కరించారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు చట్టబద్ధమైన, న్యాయమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశం సమిష్టిగా వృద్ధి చెందితేనే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు తీస్తుందని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాల కేటాయింపులపై తెలంగాణ వైఖరిని స్పష్టం చేస్తూ, చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను కచ్చితంగా కోరుకుంటున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకూ ఒకే రకమైన నిబంధనలు వర్తింపజేయాలని, దిగువ రాష్ట్రంగా తెలంగాణకున్న మిగులు జలాల హక్కులను పరిరక్షించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల ప్రయోజనాలను కాపాడటంతో పాటు కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా అనేక పెండింగ్ అంశాలు ఇంకా కొలిక్కిరాకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారమంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం కాదని, తుది నిర్ణయాలు అమలు చేయడమేనని స్పష్టం చేశారు. షెడ్యూల్ 9లోని 23 సంస్థల విభజనపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్రానికి ఇచ్చిందని

➢ మిగతా 2వ పేజిలో..

## రైతుల భూ భద్రత కోసమే 'భూ భారతి'

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ఖమ్మం జనసంఘర్షణ:**
గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులను స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భూ భద్రత కల్పించడమే లక్ష్యంగా 'భూ భారతి' ద్వారా రీ-సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు సంపూర్ణ రక్షణ కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన భూ రీ-సర్వే అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని ఏడు గ్రామాల్లో భూ భారతి సర్వే ప్రారంభమైందని, తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే పూర్తి చేస్తూ, ఏడాదిన్నర కాలంలో రాష్ట్రమంతటా ప్రక్రియను

➢ మిగతా 2వ పేజిలో..

## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

**హైదరాబాద్‌లో తులం పసిడి రూ. 1.59 లక్షలు!**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:**
అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న వేగవంతమైన పరిణామాల ప్రభావంతో దేశీయంగా పసిడి, వెండి ధరలు ఒక్కసారిగా నింగినంటాయి. అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు క్షీణించడం, డాలర్ సూచీ బలహీనపడటంతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ రాబోయే రోజుల్లో వడ్డీ రేట్ల తగ్గింపుపై వేస్తున్న అంచనాలు మార్కెట్లను విశేషంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయంగా లభిస్తున్న సానుకూల సంకేతాలతో దేశీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు భారీ పెరుగుదలను నమోదు చేశాయి. బులియన్ మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రధాన నగరాలైన హైదరాబాద్,

## 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల దోషి

**మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ జైలులోనే కన్నుమూత**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) తీహార్ జైలులో మరణించారు. అనారోగ్య కారణాలతో గురువారం ఉదయం ఆయనను జైలు అధికారులు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే, ఆయన మృతికి గల ఖచ్చితమైన కారణాలను ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది.
1984లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆమె బాడీగార్డుల చేతిలో హత్యకు గురైన అనంతరం దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో సిక్కులపై తీవ్రస్థాయిలో మూక దాడులు జరిగిన విషయం

➢ మిగతా 2వ పేజిలో..

## లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

**కేంద్రం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ జనసంఘర్షణ:**
కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్ ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ జమ్మూకశ్మీర్ హైకోర్టుకు చెందిన ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు గురువారం ఆయన పేర్కొన్నారు. 2019లో జమ్మూకశ్మీర్ వికేంద్రీకరణ తర్వాత జమ్మూకశ్మీర్, లద్దాఖ్ రెండు ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పడినప్పటికీ, ఇప్పటివరకు రెండింటికీ ఉమ్మడి హైకోర్టే కొనసాగుతోంది. లద్దాఖ్‌లో కొత్తగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు కానుండటంతో స్థానిక ప్రజలకు వేగవంతంగా, సులభంగా న్యాయం అందుబాటులోకి రానుంది. మరోవైపు, దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా

➢ మిగతా 2వ పేజిలో..

## సిద్దిపేటలో తీవ్ర విషాదం

**బావిలోకి దూసుకెళ్లిన కారు, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**



**సిద్దిపేట గరుడధాత్రి :**
**సిద్దిపేట** సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ తీవ్ర విషాదకర సంఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి సమయంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), ఆయన భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక

➢ మిగతా 2వ పేజిలో..

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

**మొదటిపేజీ తరువాయి..** గుర్తు చేశారు. అయితే, షెడ్యూల్ 10 సంస్థల ఆస్తుల విభజనకు చట్టంలో స్పష్టమైన మద్దతు లేదని, సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకూ ప్రాతిపదిక లేదన్నారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే పరిష్కరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో నీటి భద్రత, ఇంధనం, వాతావరణ మార్పులు, లాజిస్టిక్స్ వంటివి దక్షిణాది రాష్ట్రాలకు ప్రధాన సవాళ్లుగా మారనున్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీపడుతూనే పరస్పరం సహకరించుకోవాలని భట్టి పిలుపునిచ్చారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, హాజరయ్యే అన్ని రాష్ట్రాలకూ ఆత్మీయ ఆతిథ్యం ఇస్తామని ప్రకటిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# లద్దాఖ్‌లో హైకోరు బెంచ్ ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి..** రూ. 9,450 కోట్ల వ్యయంతో నాలుగు కొత్త రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులలో భాగంగా ఖరగ్‌పూర్ -- భద్రక్ మధ్య అదనపు రైలు మార్గం, భద్రక్ -- హరిదాస్‌పూర్ మధ్య మార్గం విస్తరణ, కటక్ -- పారాదీప్ మధ్య అదనపు రైల్వే లైన్ మరియు ఆంధ్రప్రదేశ్ -- తమిళనాడు సరిహద్దుల మధ్య అదనపు లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రైల్వే ప్రాజెక్టులన్నింటినీ 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# సిద్దిపేటలో తీవ్ర విషాదం

**మొదటిపేజీ తరువాయి..** (2)లతో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి అప్పనపల్లి శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రెస్క్యూ టీమ్ జేసీబీ సహాయంతో తీవ్రంగా శ్రమించి బావిలో నుంచి కారును, అలాగే నలుగురి మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఒకే కుటుంబంలో నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**అందుకు తనను బాధ్యులు చేయడం తగదు**

**క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ**

**హైదరాబాద్:** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.

సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

# రైతుల భూ భద్రత కోసమే 'భూ భారతి'

మొదటిపేజీ తరువాయి.. ముగిస్తామని చెప్పారు. రెవెన్యూ అధికారులు నిరంతరం శ్రమిస్తూ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి వ్యవస్థలో చేసిన తప్పుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. రైతులకు ఉపయోగపడేలా 'భూ భారతి' చట్టాన్ని రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న ఆయన, రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకటేనని వ్యాఖ్యానించారు.

# 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల దోషి

**మొదటిపేజీ తరువాయి..** తెలిసిందే. ఈ దాడుల్లో సిక్కుల నివాస సముదాయాలు, వ్యాపార ప్రాంగణాలపై దాడులు జరిగి భారీ ఆస్తి నష్టం సంభవించగా, అధికారిక గణాంకాల ప్రకారం 3 వేల పైచిలుకు మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాత్మక ఘటనలకు సంబంధించి నమోదైన పలు కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. పాలమ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు 2018లో ఆయనను దోషిగా తేల్చి యావజ్జీవ శిక్ష విధించగా, ఆ తర్వాత ఢిల్లీలోని సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో కూడా 2025లో మరో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అయితే, జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో ఆయన పాత్రను నిరూపించే తగిన ఆధారాలు లేకపోవడంతో కోర్టు నుంచి విముక్తి లభించింది.

జాట్ వర్గానికి చెందిన కీలక నేత అయిన సజ్జన్ కుమార్ 1977లో స్థానిక కౌన్సిలర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1980ల కాలంలో ఢిల్లీ రాజకీయాల్లో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన, ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఏకంగా మూడుసార్లు లోక్‌సభ ఎంపీగా విజయం సాధించారు.

## శ్రీనివాసరెడ్డి అక్రమాస్తులు వందకోట్లు

**అరెస్ట్ చేసిన ఎసిబి అధికారులు**

**హైదరాబాద్ :** అక్రమాస్తుల కేసులో ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డిని రంగారెడ్డి ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరికాసేపట్లో శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా అతడి ఆస్తులకు సంబంధించిన ప్రెస్ నోట్‌ను ఏసీబీ అధికారులు విడుదల చేశారు. శ్రీనివాస్‌రెడ్డి నివాసం, కార్యాలయంతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు జరిపిందని వివరించారు. ఈ సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంక్ బ్యాలెన్స్ గుర్తించినట్లు తెలిపింది. కర్మన్‌ఘాట్‌లో రెండు రెసిడెన్షియల్ ఎ÷-లాట్లు.. వీటి విలువ రూ.2.63 కోట్లు ఉంటుందని పేర్కొంది. అలాగే కర్మన్‌ఘాట్‌లో ఉ?3 పెంట్‌హౌస్.. దీని విలువ రూ.1.61 కోట్లు ఉంటుందని చెప్పింది. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయ భూమితోపాటు వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ఎ÷-లాట్లు ఉన్నట్లు గుర్తించామని వివరించింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి పెట్టినట్లు ఈ సోదాల్లో గుర్తించామని పేర్కొంది. ఈ సోదాల్లో రూ.4 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.8.60 లక్షల బ్యాలెన్స్ ఉందని స్పష్టం చేసింది.

క 680 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నాలుగు ఫోర్ వీలర్లు, మూడు

టూ వీలర్లు.. మొత్తం 7 వాహనాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ వాహనాల విలువ సుమారు రూ.59 లక్షలు ఉంటుందని పేర్కొంది. ఇంట్లో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని.. వాటిని సీజ్ చేశామంది. బ్యాంకులో 46 తులాల బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు గుర్తించారు.

÷-రీనివాస్‌రెడ్డి ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.6.87 కోట్లు ఉందని.. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్ల రూపాయిలు ఉంటుందని అంచనాకు వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ఏసీబీ వివరించింది. గతంలోనూ.. 2009లో శ్రీనివాస్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కేసు నమోదు చేసినట్లు గుర్తు చేసింది. అప్పట్లో మహేశ్వరం మండలంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఏసీబీ అధికారులు వివరించారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి: 'వీర్‌భూమి' వద్ద సోనియా కుటుంబం, ప్రధాని మోదీ నివాళులు

**న్యూఢిల్లీ:**

భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి (సద్భావనా దివస్) సందర్భంగా ఆయనకు దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నం 'వీర్‌భూమి'ని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన అందించిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని, సాంకేతిక మరియు డిజిటల్ విప్లవానికి ఆయనే పునాది వేశారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి సద్భావనా దివస్ కార్యక్రమాలను నిర్వహించాయి.

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా మాజీ ప్రధానికి అంజలి ఘటిస్తున్నట్లు ఆయన పోస్ట్ చేశారు.

రాజీవ్ గాంధీ జయంతిని ప్రతి ఏటా దేశంలో జాతీయ ఐక్యత, శాంతి, లౌకికవాదం మరియు సామరస్యాలను పెంపొందించే లక్ష్యంతో 'సద్భావనా దివస్'గా జరుపుకుంటారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం, యువతను భాగస్వాములను చేస్తూ ఆధునిక దేశ నిర్మాణాన్ని చేపట్టడం రాజీవ్ గాంధీ ప్రధాన ఆశయాలు. కాగా, 1984లో ఇందిరా గాంధీ మరణానంతరం 40 ఏళ్ల చిన్న వయసులోనే రాజీవ్ గాంధీ భారత 6వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశానికి సేవలందించారు.

## వైద్యుల నిర్లక్ష్యం: మహిళ కడుపులోనే గ్లౌజులు, పేపర్ వైప్స్ వదిలేసిన వైద్యులు!

**ముంబై:**

ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల వివాహితకు వైద్యుల నిర్లక్ష్యం తీవ్ర శాపంగా మారింది. శస్త్రచికిత్స చేసిన అనంతరం ఆమె కడుపులోనే సర్జికల్ గ్లౌజులు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్లు వేసేసిన ఘోర ఉదంతం మహారాష్ట్రలో కలకలం రేపింది. ప్రస్తుతం సదరు బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో ఈ ఘటనపై రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

బాధితురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య అనే 19 ఏళ్ల మహిళ ప్రసవం కోసం ఆగస్టు 1న బీడ్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా, నాలుగు రోజుల అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్ది రోజులకే ఆమె తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలతో అల్లాడిపోయింది. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు ఆమెను వెంటనే ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ స్కానింగ్ నిర్వహించిన వైద్యులు ఆమె కడుపులో విదేశీ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు.

పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో వెంటనే ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల బృందం మరోసారి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి కడుపులో ఉండిపోయిన సర్జికల్ గ్లౌజులు, పేపర్ వైప్స్‌ను బయటకు తీసింది. మొదటి ఆపరేషన్ చేసిన వైద్యుల తీవ్ర అలసత్వమే తన భార్య ప్రాణాల మీదికి తెచ్చిందని ఆమె భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

# కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

**డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం**

**కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం**

**న్యూఢిల్లీ, :** తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది.

ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి

# మట్టి వాసనలో మానవత్వం మంజుల పతిపాటి జీవన ప్రస్థానం

ఆగస్టు 20,(జనసంఘర్షణ)

**బాల్యం:**

1974 ఆగస్టు 8న జన్మించిన మంజుల పతిపాటి బాల్యం పల్లె వాతావరణంలో ప్రకృతి ఒడిలో సాగింది. పచ్చని పొలాలు, మట్టి పరిమళం, రైతుల జీవన పోరాటం, గ్రామీణ ప్రజల ఆత్మీయత ఆమె బాల్యాన్ని తీర్చిదిద్దాయి. చిన్ననాటి నుంచే మానవత్వం, బాధ్యత, ప్రకృతి ప్రేమ వంటి విలువలు ఆమెలో బలంగా నాటుకున్నాయి. పల్లె జీవితం ఆమెకు కేవలం జ్ఞాపకం కాదు... జీవితాన్ని అర్థం చేసుకునే తొలి పాఠశాల.



**చదువు:**

మంజుల పతిపాటి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేశారు. చదువుపై ఉన్న ఆసక్తితో పాటు స్వయంకృషితో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో, తెలుగు మీడియంలో లోయర్, హయ్యర్ టైపింగ్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అక్షరాలపై ఉన్న ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదల ఆమె వ్యక్తిత్వానికి బలమైన పునాదులుగా నిలిచాయి. పుస్తకాల నుంచి పొందిన విద్యతో పాటు, జీవితంలో ఎదురైన అనుభవాలను కూడా ఆమె ఒక పాఠంగా స్వీకరించారు. మనుషుల జీవితం, రైతుల కష్టం, ప్రకృతి, సమాజంలోని సమస్యలు ఆమెకు నిరంతర పాఠశాలగా మారాయి.

**పెళ్లి:**

వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలు పెరిగినా, మంజుల తన వ్యక్తిత్వాన్ని, తన ఆలోచనలను పక్కన పెట్టలేదు. కుటుంబాన్ని ప్రేమిస్తూ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు, సమాజం పట్ల తనకున్న బాధ్యతను కూడా కొనసాగించారు. కుటుంబం ఒక వైపు... సమాజం మరో వైపు... రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగిన ఆమె ప్రయాణం మహిళా ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

**రాజకీయం:**

ప్రజలతో మమేకమైన మంజుల ప్రయాణం రాజకీయ రంగంలోకి కూడా దారితీసింది. తొలిసారిగా రాజకీయ రంగ ప్రవేశం చేస్తూ అప్పటి తెరాస పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా మన్నేవారి తుర్కపల్లి మండల కేంద్రం నుంచి 2019 సంవత్సరంలో పోటీ చేసి కేవలం రెండు ఓట్లు తేడాతో ఓడిపోయినా కృంగి పోగుండా ప్రజా సేవలో ఉంటూ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఐదు సంవత్సరాలు పదవి కాలంలో ఉంటూ రైతులకు అండగా ఉంటూ ప్రజా సేవ చేసారు. రాజకీయాలను ఆమె కేవలం పదవి లేదా అధికారంగా కాకుండా ప్రజాసేవకు ఒక వేదికగా భావించారు. రైతుల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల అవసరాలు, మహిళల సమస్యలు వంటి అంశాలపై స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రయత్నించారు. రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములను సహజంగా స్వీకరిస్తూ ప్రజలతో ఉన్న అనుబంధానికే ప్రాధాన్యత ఇచ్చారు. పదవి ఒక హోదా మాత్రమే... ప్రజల నమ్మకాన్ని సంపాదించడం మాత్రం అసలైన గౌరవం అనే భావనతో ఆమె తన ప్రజా జీవితాన్ని కొనసాగించారు.

**సాహిత్యం:**

మంజుల పతిపాటి జీవితంలో సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆమెకు కవిత్వం కేవలం పదాల సమాహారం కాదు... మనసులోని స్పందనకు అక్షరరూపం. రైతు కష్టం కనిపిస్తే కలం స్పందిస్తుంది. ప్రకృతి అందం కనిపిస్తే పదాలు పూస్తాయి. మహిళల బాధ కనిపిస్తే అక్షరాల్లో ఆవేదన పలుకుతుంది. సమాజంలోని సమస్యలు ఆమె మనసును తాకితే అవి సాహిత్య రూపంలో వెలువడతాయి.రైతు జీవితం, ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సామాజిక స్పృహ, మానవ సంబంధాలు వంటి అనేక అంశాలు ఆమె సాహిత్య స్పందనలో ప్రతిబింబిస్తాయి. ఆమె కలం కేవలం కవితలు రాయదు... మనిషి మనసును తాకే అనుభూతులను పలికిస్తుంది.

**ముగింపు:**

పల్లె మట్టిలో పుట్టి...ప్రకృతి ఒడిలో పెరిగి...ఇంటర్మీడియట్ వరకు చదివి...తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో లోయర్, హయ్యర్ టైపింగ్‌లో ప్రథమ శ్రేణి సాధించి...





కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ...ప్రజల మధ్య నడుస్తూ...రైతు కష్టాన్ని అర్థం చేసుకుంటూ... ప్రకృతిని ప్రేమిస్తూ...సాహిత్యాన్ని తన భావాలకు వేదికగా చేసుకుంటూ...మంజుల పతిపాటి తనకంటూ ఒక ప్రత్యేకమైన జీవన ప్రస్థానాన్ని నిర్మించుకున్నారు.జీవితంలో విద్య ఒక దశలో ఆగిపోయినా, నేర్చుకోవాలనే తపన మాత్రం ఆగలేదు. పదవులు మారినా సేవాభావం మారలేదు. కాలం మారినా మానవత్వం మారలేదు. అనుభవాలు పెరిగే కొద్దీ అక్షరాలకు మరింత లోతు వచ్చింది.మనిషి ఎంతకాలం జీవించాడన్నది కాదు...ఎంతమంది జీవితాలను తాకాడన్నదే అసలైన జీవితం.మట్టి వాసనలో పుట్టిన ఆ మనసు...ప్రజల కోసం స్పందించిన ఆ హృదయం...ప్రకృతిని ప్రేమించిన ఆ చూపు...అక్షరాల్లో భావాలను పలికించిన ఆ కలం... మంజుల పతిపాటి జీవన ప్రస్థానాన్ని ఒక వ్యక్తి కథగా మాత్రమే కాకుండా, సాధారణ జీవితం నుంచి అసాధారణమైన వ్యక్తిత్వంగా ఎదిగిన ఒక మహిళా స్ఫూర్తిగాథగా నిలబెడుతున్నాయి.

# బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు రూ.20 వేల జరిమాన

- నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీడి.వి.శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)




బాలికను వేధిస్తూ, అసభ్యకరమైన ఫొటోలు పంపాలని కోరడంతోపాటు బెదిరింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించిందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం దాసరి స్వామి (26) అనే వ్యక్తి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ఫోన్ నంబర్ ఇవ్వాలని తరచూ వేధించేవాడు. బాలిక స్నేహితుల వద్ద నుంచి ఆమె నంబర్ తీసుకుని ఫోన్ చేసి, పాఠశాల వద్దకు వస్తానని, తనను కలవాలని ఒత్తిడి చేసేవాడు. బాలిక అతడిని కలవకుండా ఇంటికి వెళ్లడంతో "నువ్వు రాకపోతే పెట్రోల్ పోసుకుని చచ్చిపోతా అంటూ బెదిరించాడు.ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఇకపై బాలిక జోలికి రానని నిందితుడు రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు. అయితే రెండేళ్ల తర్వాత వేసవి సెలవుల్లో మళ్లీ బాలికకు తన స్నేహితురాలిగా వాట్సాప్‌లో రెండు రోజులపాటు సందేశాలు పంపించాడు. అనంతరం ఇన్‌స్టాగ్రామ్‌లో తనకు నగ్న చిత్రాలు పంపాలని కోరుతూ బాలికను వేధించాడు. 24-05-2024న బాలిక తండ్రికి ఫోన్ చేసి తన కుమార్తెను ఇంటికి పంపాలని, లేకపోతే ఆమె మేజర్ అయిన తర్వాత లేపుకుపోతానంటూ బెదిరించాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శివంపేట అప్పటి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు, కోర్టు వ్యవహారాల్లో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కృష్ణగౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారు.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అభినందించారు.

# మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యదర్శిలను ఎన్నుకోవడం జరిగింది

- జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా మేకల లావణ్య, జిల్లా కార్యదర్శిగా ఎరుపుల మమతను నియమించడం జరిగింది.
- బిజెపి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లికా ఆధ్వర్యంలో నూతన కమిటీలో ఎన్నుకోవడం జరిగింది.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)



భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చ నూతన కమిటీని బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దుస్ మల్లేష్ గౌడ్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లికా ఆధ్వర్యంలో నూతన ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో రామాయంపేట పట్టణానికి చెందిన మేకల లావణ్యను జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కార్యదర్శిగా ఎరుపుల మమతను నియమించడం జరిగింది.వీరిద్దరూ పార్టీ క్రియాశీలంగా, పార్టీ ఎదుగుదలకు, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని అన్నారు. తమను నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లికా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగి రాములు,పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

- రామాయంపేట మున్సిపాలిటీ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు, స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్యబి నాగరాజు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, వైస్ చైర్ పర్సన్ కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# చల్మెడ గ్రామ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరసింహ రెడ్డి ఇటీవల గుండెపోటు రావడంతో అకస్మాత్తుగా మరణించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి కల్పించారు. గ్రామస్తులు నరసింహారెడ్డి సేవలను గుర్తుచేసుకొని చింతించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశం, ఉపసర్పంచ్ రమేష్, ముత్యం రెడ్డి,మాజీ సర్పంచ్ నారాయణ, రమేష్, శ్రీను, మహేందర్, సిద్ధ రాములు, తిమ్మయ్య, జెట్ చెరువు తండా సర్పంచ్ బాబు, గౌతమ్, సురేష్ ,రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలి

- ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతును అభినందించిన కలెక్టర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతి పూర్ గ్రామంలో రైతు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం హవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతి పూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించి,రైతు దొమ్మట జైపాల్ రెడ్డి సాగు చేస్తున్న ఒక ఎకరం డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. రైతు ఒక ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి,సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ తోటలో మొక్కల పెరుగుదల, పూత వచ్చే విధానం,పంట దిగుబడి,సాగు ఖర్చులు, మార్కెట్ ధరలు,తదితర అంశాలపై కలెక్టర్ రైతుతో వివరంగా మాట్లాడారు. పంట సాగుకు ప్రభుత్వం నుంచి అందిన సబ్సిడీ ఎంత, సబ్సిడీ ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను ఏ సైజులో కట్ చేస్తారు,కత్తిరింపు విధానం ద్వారా మొక్కల పెరుగుదలను ఎలా నియంత్రిస్తున్నారు, కలుపు మొక్కలు రాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే అంశాలపై కూడా ఆరా తీశారు. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ పనితీరును కూడా పరిశీలించి,మొక్కలకు అవసరమైన మేరకు నీటిని అందించే విధానం,నీటి వినియోగ సామర్థ్యం,తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు పూత ఎలా వస్తుంది,పూత వచ్చిన తర్వాత ఎన్ని రోజులకు కాయలు కోతకు వస్తాయి, ప్రస్తుతం పంటకు మార్కెట్‌లో లభిస్తున్న ధర ఎంత అనే విషయాలపై కలెక్టర్ రైతుతో చర్చించారు. ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ, ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు జైపాల్ రెడ్డి అనుభవాలను కలెక్టర్ ఆసక్తిగా తెలుసుకున్నారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల,అధిక విలువ కలిగిన ప్రత్యామ్నాయ పంటలను రైతులు స్వీకరించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.సాగులో డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ పద్ధతులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,ఇతర సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కోయగుట్ట మల్లన్న ఆలయంలో ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి కోయగుట్ట మల్లన్న ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి మల్లన్న తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పూజారి మల్లన్న కోరారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక

శుక్రవారం
21 ఆగస్టు 2026

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరుద్యోగులకు ఉద్యోగ భృతి కల్పించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. గురువారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే భర్తీ చేయాలని దేశాభివృద్ధిలో యువత నిరుద్యోగ కొరలో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నదనీ ఆవేదన వ్యక్తం చేశారు.స్వతంత్రం వచ్చి 79 ఏళ్లు కావస్తున్న యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేవన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో లక్షలలో కొలువులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ అతిగతి లేదన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు పకోడీలు బజ్జీలు వేయించడం కూడా ఉద్యోగాలే అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనడం పై మండి పడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందన్నారు. పేపర్ లీకేజీలు,పరీక్ష వాయిదాలు, కోర్టు వివాదాలతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైందనీ వారు అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మల్లేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలపై యూత్ డిక్లరేషన్ ప్రకటించారు. స్వయంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అశోక్ నగర్ లో నిరుద్యోగులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తే నిరుద్యోగుల బతుకు మారుతుందని భరోసా ఇచ్చారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 16 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు కలిపి మొత్తం 62,000 ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. 20,000 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీలు ఉంటే 7,437 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు చేయడం లేదు. నోటిఫికేషన్లు కూడా ఇవ్వడం లేదు.లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ, హాస్టల్లో మగ్గిపోతున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వాము చేస్తుంది .నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 9,000 మంది పదవి విరమణ పొందుతున్నారు. ఈ విధంగా రాష్ట్రంలో రెండు లక్షల పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నియామకాలు చేపట్టకుండా కాలం వెల్లదీస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేస్తోంది మెదక్ జిల్లాకు అనుగుణంగా ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మెదక్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు.

**డిమాండ్స్..**

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీని కేంద్రం బిజెపి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి.



కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్స్ ఇచ్చి భర్తీ చేయాలి.పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి,భర్తీ చేయాలి. డీఎస్సీ, జేఎల్, డిఎల్, గ్రూప్-1,2,3, 4లతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి.ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంతవరకు నెలకు 5,000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవులను తొలగించి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్,యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. స్థానిక పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగాల అవకాశాలు కల్పించాలి.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటి సభ్యుడు సంతోష్, పార్టీ సభ్యులు అజయ్, బాబు, దుర్గ భవానీ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగల పెంపకం స్వయం ఉపాధికి మార్గం

❑ కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ బోగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్ రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుల తేనెటీగల పెంపకాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదిమంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులు అందజేయడం జరిగిందని 40 శాతం సబ్సిడీ, 60 శాతం లబ్ధిదారుల వాటాతో ఈ తేనె తీగల పెంపకం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఒక బాక్సు తేనె తీగల పెంపకానికి 6,000 రూపాయలు ఖర్చుకాగ అందులో ఉద్యానవన శాఖ సబ్సిడీ 2,400 ఉంటుందని, లబ్ధిదారిన వాటా 3,600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 15 రోజుల వ్యవధిలో ఒక బాక్స్ తేనెటీగల పెంపకం ద్వారా మూడు కిలోల తేనె ఉత్పత్తి కాగా ఒక కేజీకి 600 చొప్పున 1800 రూపాయల నికర ఆదాయం వస్తుందని. 104 బాక్సుల ద్వారా 10 మంది రైతులకు 312 కేజీల తేనె ఉత్పత్తి ద్వారా ఒక నెలకు 1,87,200 ఆదాయం చేకూరు తుందన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. కొండతెర, కొండిలేని, ఐరోపా, పుట్ట, విసినకర్ర తేనెటీగలు





వంటి రకాలు ఆర్థిక ప్రాముఖ్యను అంది స్తాయని స్పష్టం చేశారు.తేనెటీగల పెంపకం నైపుణ్యత గల పరిపూర్ణ అనే వ్యక్తి ద్వారా సంపూర్ణ అవగాహన చేసుకుని పెంపకంలో మేలుకోలు తెలుసుకుని భవిష్యత్తులో ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ సాగు పంట తోపాటు అనుబంధ రంగాల్లో పట్టు సాధించాలన్నారు. వ్యయసాయ అనుబంధ పద్దతుల్లో భాగంగా శాస్త్రీయంగా తేనెటీగల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ తీసుకుంటున్న చొరవను కొనియాడారు.ఈ పెంపకంలో రైతులు ఉద్యాన పంటలో ఉత్పాదకతను పెంచి ఆదాయంతోపాటు అదనపు ఉపాధి అందుతుందన్నారు. దేశంలోనే తేనెటీగల ఉప యోగాలు వాటి మనుగడలను ప్రాచీన కాలంలోనే గుర్తించినట్లు తెలిపారు. తేనెటీగల పెంపకం అనేది రైతు లకు పంట అధిక సాగు, రైతులకు ఎంత గానో ఆర్థికంగా లాభంచేకూరుస్తుందన్నారు. రైతులు ఆర్థిక స్వాలంభనకు కృషి చేసి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, సంబంధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఘన నివాళులు



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

దేశంలో నూతన టెక్నాలజీకోసం కృషి చేసిన మహనీయులు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు అన్నారు. గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని ఆధునికత, సాంకేతిక ప్రగతి వైపు నడిపించిన దార్శనిక నాయకుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిచారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఆలకంటి నాగరాణి

❑ నూతనంగా నియమించిన పార్టీ నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన మహిళా మోర్చా జిల్లా ఎన్నికల్లో మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామపంచాయతీ లోని రైల్వే స్టేషన్ కు చెందిన అలకంటి నాగరాణి ని బిజెపి మెదక్ జిల్లా కార్యదర్శిగా నియమిం చినందుకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ... తనను మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమిం చినందుకు జిల్లా ఎంపీ రఘునాథన్ రావు, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు రాగి రాములు, మహిళా మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లికా లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు ఆర్థికసాయం

❑ రూ.5 వేల సాయం అందించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ఆర్థిక సాయం అందజేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)



రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జర్నలిస్టు కుస్తీ నారాయణకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ లు ఆర్థికసాయం అందించారు. దామరచెరువు గ్రామానికి చెందిన కుస్తీ నారాయణ ఓ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు.ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు విరగడంతో చికిత్స పొందుతున్నారు. నారాయణ ఆరోగ్య పరిస్థితిని జర్నలిస్టుల ద్వారా తెలుసుకున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, డాక్టర్ మోహన్ నాయక్ లు స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. మోహన్ నాయక్ నేరుగా ఇంటికి వెళ్లి నారాయణకు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.నారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.జీ. శ్రీనివాస శర్మ, జిల్లా కోశాధికారి ఊడెం దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పాతూరి రమేష్‌గౌడ్, రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం, ప్రెస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి పటేరి రాము, బీఆర్ఎస్ నాయకులు భానుచందర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## హిరలాల్‌కు హృదయపూర్వక అభినందనలు ధన్యవాదాలు

❑ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)



రెండు పర్యాలు డాక్య తాండ సర్పంచ్‌గా పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, మెదక్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు అని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. పాపన్నపేట్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ధన్యవాదాలు ఎందుకనగా మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలవడానికి కారణమైన పాపన్నపేట మండలంలో ఒక బంజారా బిడ్డకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించడం జరిగింది. ఇదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఇప్పుడు మా బంజారా బిడ్డకి ఇచ్చినందుకు ఒక బంజారా బిడ్డగా నేను చాలా గర్వపడుతున్నాను ఇలాంటి పదవులు ఎవరికి వివరిస్తాయంటే దేశభక్తి దైవభక్తి కార్యకర్తలపై శ్రద్ధ కష్టపడ్డ కార్యకర్తకి ఇలాంటి పెద్ద పెద్ద పదవులు వరిస్తాయి. కావున ఇదే స్ఫూర్తి నా మిత్రుడు హిరాలల్ లో ఉంది కాబట్టే పాపన్నపేట్ మండల కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ గుర్తించి ఇచ్చినందుకు నాయొక్క హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## రహదారి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి

❑ జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)

చేగుంట (గాంధీ చౌక్) నుండి మెదక్ వెళ్ళు రోడ్డు నకు గల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తేది: 23.08.2026 అర్ధరాత్రి 12.00 గంటల నుండి ప్రారంభమగుననీ, ఈ కారణంగా చేగుంట నుండి మెదక్ (ఎల్‌సీ నం.228 టీ) వద్ద రహదారి రాకపోకలను నిర్మాణ పనులు పూర్తి అయ్యా వరకు తాత్కాలికముగా నిలిపివేయడం జరుగుతుంది. కావున వాహనదారులు ఈ దిగువ చూపబడిన ప్రత్యామ్నయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించనైనది.

1. ద్వి, త్రి చక్ర వాహనములు వినియోగించుకోవలసిన మార్గము.
ఎల్సి గేటు వద్ద ఉన్న సీసీ రోడ్ నుండి పాత నేషనల్ హైవే చేగుంట పట్టణ సరిహద్దు అనగా ప్రస్థుత ఆర్ యు బి నుండి బస్సు స్టాప్ ఎదురుగా గల వెంచర్ మీదుగా వెళ్ళవలెను. 2. కార్లు, బస్సులు, డి.సి. యం.వ్యాన్లు, ఇతర వాహనములు వినియోగించుకోవలసిన మార్గము :నార్సింగి నుండి శంకరంపేట (ఆర్) (వయ మిర్జాపల్లి) డబుల్ రోడ్డు మార్గము ద్వారా వెళ్ళుటకు గాను సూచించనైనది. 3. ట్రాక్కులు, భారీ వాహనములు వినియోగించుకోవలసిన మార్గము :రామాయంపేట నుండి లేదా నర్సాపూర్ మార్గము నుండి వెళ్ళవలెను.
4. కార్లు, బస్సులు, డి.సి.యం. వ్యాన్లు ఇతర వాహనములు ఇతర మార్గాలను గలను ద్వారా కూడా వినియోగించుకోగలరు :మాసాయిపేట నుండి మెదక్ ప్రయాణించే వాహనములు శంకరంపేట(ఆర్) వయా ధర్పల్లి రోడ్ నుండి వెళ్ళుటకు సూచించనయినది. తూప్రాన్ నుండి మెదక్ ప్రయాణించే వాహనములు వెల్దుర్తి - ఉప్పులింగాపూర్ - గవ్వలపల్లి ద్వారా వెళ్ళుటకు సూచించనయినది.కావున జిల్లా ప్రజలు ఇట్టి ప్రత్యామ్నయ మార్గాలను వినియోగించుకోగలరు. పోలీసుల సూచనలను పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 20(జనసంఘర్షణ):



చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశంలో ఆధునిక సాంకేతికతకు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ భారతదేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. దేశ సమైక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంసిహెచ్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆకస్మిక తనిఖీ



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)**

మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆసుపత్రిలో ఆకస్మికంగా పర్యటించి అక్కడి వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మెదక్ మెడికల్ కాలేజీని సందర్శించి కాలేజీలోని ఏర్పాట్లు, పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి కాలేజీకి సంబంధించిన వివిధ సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు.కాలేజీ, ఆసుపత్రికి సంబంధించిన సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు.మెడికల్ కాలేజీ సమస్యలపై ప్రిన్సిపాల్‌తో ఎమ్మెల్యే రోహిత్ చర్చ. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఎం సి హెచ్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా ఎం సి హెచ్ ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడి వైద్య సేవలు, రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు.తదుపరి మెడికల్ కాలేజీకి వెళ్లిన ఎమ్మెల్యే కాలేజీ పరిసరాలను పరిశీలించి, ప్రిన్సిపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలేజీలో నెలకొన్న వివిధ సమస్యలు, అవసరాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కాలేజీ అభివృద్ధికి సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎం సి హెచ్ మెడికల్ కాలేజీలో ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన సమస్యల పరిష్కారానికి హామీ. తదుపరి మెడికల్ కాలేజీకి వెళ్లి కాలేజీ నిర్వహణ, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో సమావేశమై కాలేజీకి సంబంధించిన వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలేజీ, ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై మంత్రి గారితో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు.

## బోధన్ డివిజన్ బీడీఎస్ఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

◆ **విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి**




**బోధన్, ఆగస్టు 20 (జన సంఘర్షణ):**

బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీడీఎస్ఎఫ్) బోధన్ డివిజన్ నూతన కమిటీని గురువారం బోధన్ పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ తలారే మాట్లాడుతూ.. బోధన్ డివిజన్ పరిధిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ చురుగ్గా పనిచేయాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తితో విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే నిర్ణయాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సంజయ్ తలారే డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. స్కిల్ యూనివర్సిటీ, కొత్త విధానాల పేరుతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపరచకుండా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నూతన కమిటీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## ఆగస్టు 23న ఉచిత వైద్య శిబిరం..

◆ **కోటగిరి, పోతంగల్ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి...**

**కోటగిరి,/ ఆగస్టు 20 /(జన సంఘర్షణ):**



రామకృష్ణ మఠం హైదరాబాద్, రామకృష్ణ సేవా సమితి కోటగిరి ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న హెల్త్ క్యాంపును కోటగిరి, పోతంగల్ మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ముఖ్యంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న పేదలు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను కోటగిరి గ్రామ సర్పంచ్ బర్ల మధు ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ముందస్తుగా శిబిరానికి హాజరై వైద్యుల సూచనలు, అవసరమైన వైద్య సేవలను పొందాలని నిర్వాహకులు కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 20(జనసంఘర్షణ ):**

భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా, పంచాయతీ ఆఫీస్ ఎదురు గా చర్ల కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నూగురు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు మాట్లాడుతూ..కోట్లాది ప్రజల్లో ఆశలను నింపి, 21వ శతాబ్దపు అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేసిన దూరదృష్టిగల నాయకుడు రాజీవ్ గాంధీని మనం స్మరించుకుంటున్నాం. ఆయన చేపట్టిన విప్లవాత్మక మార్పులతోనే, భారత యువతపై ఆయనకున్న అచంచల విశ్వాసంతోనూ, సాంకేతిక పురోగతిపై ఆయన చూపిన దూరదృష్టితోనూ, కొత్త ఆలోచనల శక్తిపై ఆయన నమ్మకంలోనూ ఆయన వారసత్వం నేటికీ సజీవంగా నిలిచివుంది. రాజీవ్ గాంధీజీకి మనం అందించగల అత్యంత అర్థవంతమైన నివాళి ఏమిటంటే, భారతదేశపు చిరస్మరణీయ 'సామరస్యం, సర్వ బౌమత్వం, సమైక్యత స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తూ, మేథో నైపుణ్యాన్ని,



ఆవిష్కరణలను, మన యువత ఆకాంక్షలను ప్రోత్సహించడం. ఆయన జయంతి సందర్భంగా ఆయనకు మన గాఢమైన నివాళులు అర్పిస్తూ, దేశ నిర్మాణానికి ఆయన అందించిన అమూల్యమైన సేవలను, విశిష్టమైన కృషిని స్మరించుకుంటూ రాజీవ్ గాంధీ కి ఘన నివాళులు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, చర్ల పిఏసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చర్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు,సీనియర్ నాయకులు జవ్వాది రవి ,ఎర్రెంకి ఉదయ ప్రభాకర్ రావు బాబ్జి ,మేడిచర్ల కుమార్ ,అలవాల మహేష్ నాయుడు, బాలు,సుందరి సురేష్,పటేల్ వెంకటేశ్వర్లు , మాజీ సర్పంచ్ ఎలకం నరేంద్ర, తోట మల్ల వరప్రసాద్, వల్లి శ్రీకాంత్, కాకర్ల కుమార్, వార్డ్ మెంబర్ కుక్కడపు రాజేశ్వరి, పాశిగంటి శ్రీదేవి, హబీబ్ ఖాన్, ఎస్సీ సెల్ నాయకులు చెన్నం రామ్మూర్తి, గొబ్బురి పూర్ణచందర్ రాజు, కణితి శ్రీనివాసరావు, పూనెం రాంబాబు, శ్యామల తరుణ్, లాయర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు, పారిశుధ్య కార్యక్రమాలు ఏమున్నా మా దృష్టికి తీసుకుని రండి

◆ **11వార్డ్ భూక్య సుశీల**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణం, ఆగష్టు 20(జనసంఘర్షణ):**

భద్రాచలం అశోక్ నగర్ కాలనీలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ 11వ వార్డు మెంబర్ భూక్య సుశీల ఆధ్వర్యంలో మెడిలైఫ్ సందులో ఉదయం నుండి కాలనీలో పర్యవేక్షిస్తూ పుడుకు పోయిన కాలువలు, చెత్త, పిచ్చి మొక్కలు, గ్రామ పంచాయతీ కార్మికులతో తీపించడం జరిగింది. అనంతరం కాలనీలో పర్యవేక్షిస్తూన్నా సందర్భంలో కాలనీవాసులు కొన్ని సమస్యలు తమ దృష్టికి తెలియజేయడం జరిగింది. అశోక్ నగర్ కాలనీలో కొంతమంది ఇల్లులు ఉన్న కూడా వాటిని వదిలేసి ఎక్కడ నివాసం ఉంటున్నారు, అక్కడ ఉన్నటువంటి ఇళ్లలో బాగా చెట్లు పెరిగి, పాములు విష సర్పలు తో శిదిలావస్థకు చేరుకోవడం జరిగింది. ఇళ్ల పక్కన ఉన్నవాళ్లు భయాందోళన చెందుతున్నారు, అశోక్ నగర్ కాలనిలో ఉన్నా ఖాళీ స్థలం వదిలేసి వెళ్లిన ఇల్లులు శిథిలావస్థకు చేరిన ఇళ్లకు ఒక వారం రోజుల్లో చెత్తాచెదారం తొలగించని ఎడల భద్రాచలం గ్రామపంచాయతీ ఈఓ కి, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే గ్రామపంచాయతీ వారు ఆ యొక్క స్థలాన్ని గ్రామపంచాయతీ అధికారులు ఆ స్థలాన్ని ఆదినంలోకి తీసుకోవడం జరుగుతుంది అని తెలియజేయడం జరిగింది. ఏ సమస్యలున్న నేరుగా, నన్ను నేరుగా సంప్రదించలానీ తెలియజేయడం జరిగింది.

## ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)**



మా డిపార్ట్మెంట్‌లో అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతుమని తరతామ్యాలు బేద అభిప్రాయలు రాకుండా మా శాఖకు మంచి పేరు తీసుకువస్తామని మెదక్ జిల్లా ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య స్పష్టం చేశారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో హెడ్ ఒకానిస్టేబుల్ కానిస్టేబుల్స్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ మెదక్ సిఐ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్స్ఒ కానిస్టేబుల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ కానిస్టేబుల్ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన సమస్యను పరిష్కరించుకుంటామని వెల్లడించారు.త్వరలోనే నూతన కమిటీ ద్వారా ప్రణాళికలు చేస్తామని అన్నారు. మా నూతన కార్యవర్గం పారదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షతతో పాటు జనరల్ సెక్రటరీ జీవన్ కోశాధికారి శ్రీకాంత్ అసోసియేట్ అధ్యక్షులు స్వామి ఉపాధ్యక్షులు మహేష్ బాబు జాయింట్ సెక్రెటరీ లావణ్య పబ్లిసిటీ సెక్రటరీ రవి నాగరాజు రజిత పలువురు పాల్గొన్నారు. ఈ నూతన కార్యవర్గానికి అధికారులు ఘనంగా సన్మానించారు.

## పోచారం అడవిలో పర్యాటకుల కోసం కొత్త వెహికల్ ప్రారంభం

◆ **పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటక సౌకర్యాల విస్తరణకు చర్యలు.**

◆ **ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.**

◆ **పోచారం అడవిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం.**

◆ **ఎమ్మెల్యే రోహిత్ రావు.**

◆ **అడవి అందాలను ఆస్వాదించేందుకు ఆధునిక ప్రయాణ వాహనం అందుబాటులోకి.**

◆ **పోచారం అడవిలో పర్యాటకుల కోసం కొత్త వెహికల్ ప్రారంభం.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అడవి అందాలను మరింత సౌకర్యవంతంగా వీక్షించేలా కొత్త ప్రయాణ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఈ కార్యక్రమానికి హాజరై,పోచారం అడవిలో పర్యాటకుల ప్రయాణానికి ఉపయోగపడే ఆధునిక వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యంతో ఎంతో ప్రత్యేకత కలిగి ఉందని అన్నారు. అటవీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రకృతి అందాలను దగ్గరగా వీక్షించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం ఆధునిక ప్రయాణ వాహనాన్ని ప్రారంభించడం ద్వారా అటవీ ప్రాంతాన్ని సందర్శించే




వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే పోచారం అటవీ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే సూచించారు. పర్యాటకులు అటవీ ప్రాంతంలో పర్యటించే సమయంలో అటవీ నియమాలను పాటిస్తూ, ప్రకృతి సంపదను కాపాడాలని ఆయన కోరారు.పోచారం అడవికి వచ్చే పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఈ కొత్త వాహనం అందుబాటులోకి రావడంతో పోచారం అటవీ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం లభించనుంది.

## టి ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు డెడ్ లైన్ ఆగస్టు 31

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జన సంఘర్షణ)**




జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టి ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు డెడ్ లైన్ ఆగస్టు 31 అని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టీ–ఫైబర్ సేవలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో టీ ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయడంపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ) సంజయ్ జాజు ప్రత్యేక ఆదేశాలతో,ప్రైవేట్ ఇంటర్నెట్లను తొలగించి టి ఫైబర్ ఇంటర్నెట్ మారాలని సంబంధిత అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు టీ ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయడం గురించి ప్రత్యేక నోడల్ ఆఫీసర్ నియమించి సమగ్ర ప్రణాళిక రూపొందించి త్వరలో కలెక్టరేట్లో అన్ని శాఖల తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఇంటర్నెట్ అందుబాటుకు తీసుకువచ్చే విధంగా పగడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.ఇంటర్నెట్ వినియోగం,వాటి సామర్థ్యం అన్ని ప్రభుత్వ కార్యాలయాలనుంచి సమగ్ర అంచనాల రూపొందించుకొని ఇంటర్నెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 31 వరకు. డి ఫైబర్ ఇంటర్నెట్ ఏర్పాటు చేసే విధంగా అన్ని శాఖల ఉన్నతాధికారులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఈ.డీ.ఎం సందీప్, టి.ఫైబర్ ఇంటర్నెట్ మెదక్ జోనల్ మేనేజర్ ఈశ్వర్, టి.ఫైబర్ ఇంటర్నెట్ డీ.ఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 ఆగస్టు 2026

# సన్న రకాల వరి సాగు రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి..

- **ఆన్‌లైన్ నమోదు చేసుకున్న రైతులకే క్వింటాల్‌కు రూ.500 బోనస్.. సెప్టెంబర్ 10 చివరి గడువు...**

నిజామాబాద్, ఆగస్టు 20 (జన సంఘర్షణ):
సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్ పొందేందుకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. విత్తన డీలర్ వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలు సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను గడువులోగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. వీటిలో తెలంగాణ సోనా (RNR 15048), సాంబ మషూరి (BPT 5204), KNM 1638 (HMT), WGL 44, KNM 7715 తదితర ప్రభుత్వం గుర్తించిన సన్న రకాలు ఉన్నాయి.

**డీలర్ వద్ద నమోదు ఇలా......**

పైన పేర్కొన్న సన్న రకాల విత్తనాలను విత్తన డీలర్ వద్ద కొనుగోలు చేసిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, విత్తన కొనుగోలు రసీదు తీసుకుని సంబంధిత విత్తన డీలర్‌ను సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

**సొంత విత్తనాలు వినియోగించే రైతులకు.....**

సొంత విత్తనాలు, ఇతర రైతుల నుంచి పొందిన విత్తనాలు, పరిశోధనా కేంద్రాలు లేదా అనుమతించబడిన ఇతర వనరుల నుంచి విత్తనాలు పొందిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిను సంప్రదించి (రైతు ధృవీకరణ పత్రం) సమర్పించి నమోదు చేయించుకోవాలని అధికారులు తెలిపారు.

**సెప్టెంబర్ 10 చివరి తేదీ...**

సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు 2026 సెప్టెంబర్ 10వ తేదీలోగా తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. గడువు ముగిసిన తర్వాత నమోదు చేసుకునే అవకాశం ఉండకపోవచ్చని, కాబట్టి రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే నమోదు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న బోనస్ ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# కారు ఢీకొని యువతి మృతి...

- **ఎంపీ కుమారుడిపై కేసు నమోదు...**
- **మాదాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..**
- **ఆస్టన్ మార్టిన్ కారు ఢీకొనడంతో 26 ఏళ్ల యువతి మృతి...**

హైదరాబాద్, /ఆగస్టు 20/ (జన సంఘర్షణ):
హైదరాబాద్ మాదాపూర్‌లో ఈ నెల 16న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల భారతి ముఖి మృతి చెందింది. రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన ఆస్టన్ మార్టిన్ కారు ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి విధులు ముగించుకుని వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో కారు ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజుష్ (21)పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడికి చట్టపరమైన నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

**సూపర్ లగ్జరీ కార్ల వేగంపై ఆందోళన..**

నగరంలో ఖరీదైన, సూపర్ లగ్జరీ కార్లను అతివేగంగా నడుపుతున్న ఘటనలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారులపై నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# రూపారెడ్డి హత్యపై ప్రైవేట్ స్కూళ్ల బంద్...

- **నిందితులను కఠినంగా శిక్షించాలి..**
- **పాఠశాలల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి....**

నల్గొండ, /ఆగస్టు 20/ (జన సంఘర్షణ):
నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి (45) హత్యకు గురైన ఘటనపై తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. విద్యా రంగానికి చెందిన వ్యక్తిపై జరిగిన ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నిరసనగా రేపు... రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయాలని అసోసియేషన్ పిలుపు నిచ్చింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ప్రకటన చేశారు.



**నిందితులకు కఠిన శిక్ష తప్పదు.....**

రూపారెడ్డి హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు త్వరగా గుర్తించి, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది.

**పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి..**

ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని యాజమాన్య సంఘం హెచ్చరించింది. విద్యా సంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించింది.
రూపారెడ్డి హత్యకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు.

# నామినేటెడ్ పోస్టులలో పాత వారికే 70 శాతం ప్రాధాన్యత

- **ఒక నియోజకవర్గంలో 25 సహకార సంఘాలు ఉంటే దాంట్లో 14 సహకార సంఘాలు పాత వారికే**
- **ఎవరు కాదన్నా, అవునన్నా ఇది పార్టీ విధానం**
- **పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి**

నిజామాబాద్ బ్యూరో /ఆగస్టు 20/జన సంఘర్షణ



2014 నుంచి పార్టీ కోసం కష్టపడ్డ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగాని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాని, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గని, దీంతోపాటు 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషిచేసిన సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు వారికి ముందుగా ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. గురువారం నిజామాబాద్ లో మీడియాతో మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పార్టీని పట్టుకొని ఉంటున్న నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని, ఎవరు ఆందోళన చెందనవసరం లేదని మహేష్ కుమార్ గౌడ్ భరోసా కల్పించారు. బుధవారం నిజామాబాద్ లో జరిగిన సర్ సమావేశంలో బాన్స్వాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పనితీరుపై మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన గురువారం స్పందించారు. త్వరలో నియామకం చేపట్టనున్న దేవాదాయ శాఖ చైర్మన్లు, సహకార సంఘం చైర్మన్లు, వివిధ నామినేట్ పోస్టులు పాత కాంగ్రెస్ నాయకులకే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. పాత కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు 70 శాతం నామినేట్ పోస్టులు కేటాయిస్తామని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఎవరు కాదన్నా. అవునన్నా ఇది పార్టీ సిద్ధాంతం. దీనికి అందరూ కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన వారిని ఉపేక్షించేది లేదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో 25 సహకార సంఘాలు ఉంటే వీటిలో 14 సహకార సంఘాలు పాత కాంగ్రెస్ వారికే ఇస్తామని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎవరు ఆందోళన చెందకుండా రాబోయే ఎన్నికల్లో మళ్ళీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కొంతమంది పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వారిపై పార్టీ చర్యలు తీసుకుంటుందని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పాత,కొత్త అనే తేడా లేకుండా అందరూ కష్టపడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలంటూ మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

# పోతంగల్ శివారులో అక్రమ ఇసుక రవాణా పట్టివేత

- **అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం..**
- **ఇద్దరిపై కేసు నమోదు....**
- **అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక....**

పోతంగల్, /ఆగస్టు 20/ (జన సంఘర్షణ):
మంజీరా నది నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోటగిరి పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో పోతంగల్ గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇసుక లోడుతో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వ అనుమతి పత్రాలను చూపించాలని పోలీసులు.... కోరగా, ఎలాంటి అనుమతి పత్రాలు లేవని డ్రైవర్ తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో ఇసుక ట్రాక్టర్‌ను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ శ్రీనివాస్.....ఆధ్వర్యంలో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం:.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించే వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు సహకరించే వారిపైనా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బంద్ విజయవంతం

- **శక్తి స్కీమ్‌తో విద్యార్థులకు ఒరిగేదేమీ లేదు.. ప్రభుత్వం పునరాలోచించాలి**
- **పాలిటెక్నిక్ కోర్సులను డీగ్రేడ్ చేయొద్దు.. ఎస్ఎఫ్ఐ డిమాండ్..**

కోటగిరి, ఆగస్టు 20 (జన సంఘర్షణ):



విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కోటగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ బోధన్ కన్వీనర్ వాగ్మారే విశాల్మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిన బంద్‌లో భాగంగా కోటగిరిలో కూడా విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో తీసుకొచ్చిన 'శక్తి' పాలసీ ద్వారా డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం సరికాదన్నారు. విద్యారంగాన్ని 'ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్' పేరుతో మార్చి,.... ఎస్‌బీటీఈటీని తొలగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో పాలిటెక్నిక్ విద్యార్థులను కార్మికులుగా మార్చే విధానాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలి:. పాలిటెక్నిక్ విద్యను మరింత అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం, కోర్సులను డీగ్రేడ్ చేసే నిర్ణయాలు తీసుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగిస్తుందని విశాల్ అన్నారు. జీవో నంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదని, విద్యారంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పాలిటెక్నిక్ కోర్సులను ఇంజనీరింగ్ కోర్సులుగా మరింత. ఉన్నతీకరించాల్సింది పోయి డీగ్రేడ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్ని మండల కార్యదర్శి వినయ్, సుశాంత్, సిద్ధు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# కోటగిరి, పోతంగల్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీలు..

- **ఆగస్టు 22న కమిటీల ఏర్పాటు.. కోటగిరిలో ఉదయం 10.30 గంటలకు, పోతంగల్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు సభలు**

కోటగిరి, /ఆగస్టు 20/(జన సంఘర్షణ):
నిజామాబాద్ జిల్లా ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలాల్లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీల ఏర్పాటు కోసం ఈ నెల 22న ప్రత్యేక సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ కే. పోచారం మాదిగ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా....లినిజామాబాద్ జిల్లా మాసాయిపేట యాదగిరి మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ముందుగా కోటగిరి మండలంలో ఉదయం 10.30 గంటలకు, అనంతరం పోతంగల్ మండలంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సభలు నిర్వహించి నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



**నూతన కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు:..**

కోటగిరి మండలానికి చెందిన పేగులాలయ, కన్నం శ్రీనివాస్, పోశెట్టి (పండు), అశోక్ తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అలాగే పోతంగల్ మండలంలో నేరెళ్ల అశోక్ మాదిగ, నక్కవార హరిదాసు మాదిగ, కర్రే సాయినాథ్ మాదిగ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు, నాయకులు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# కామారెడ్డి జిల్లాలో 8 నెలల్లో నలుగురు ఎస్సైలు ఏసీబీకి!

- **డీజీపీ అవినీతిపై హెచ్చరించిన వారం రోజుల్లోనే రాజంపేట ఎస్సై పట్టివేత.. పోలీస్ శాఖలో కలకలం**

కామారెడ్డి బ్యూరో/ఆగస్టు 20 /(జన సంఘర్షణ/

కామారెడ్డి జిల్లాలో పోలీస్ శాఖలో అవినీతి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన నలుగురు ఎస్సైలు లంచం ఆరోపణలపై ఏసీబీకి చిక్కడం పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది. తాజాగా గురువారం రాజంపేట ఎస్సై ఆంజనేయులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటనతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల పోలీస్ శాఖలో అవినీతి ఉందని అంగీకరించి, శాఖను ప్రక్షాళన చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసిన నేపథ్యంలోనే తాజా ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

**ఒకరి తర్వాత మరొకరు....**

కామారెడ్డి జిల్లాలోని లింగంపేట్‌లో గతంలో ఓ ఎస్సై ఏసీబీకి పట్టుబడగా, ఆయన స్థానంలో నియమితుడైన మరో ఎస్సై కూడా కొద్ది కాలానికే లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కినట్లు సమాచారం. అలాగే నాగిరెడ్డిపేట్ ఎస్సై కూడా లంచం వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడిన ఘటన పోలీస్ వర్గాల్లో కలకలం సృష్టించింది. తాజాగా రాజంపేట ఎస్సై ఆంజనేయులు పట్టుబడటంతో జిల్లాలో ఎస్సైలపై వరుస ఏసీబీ చర్యలు చర్చనీయాంశమయ్యాయి.

**డీజీపీ ప్రక్షాళనకు.. క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు...**

పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేసి, బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ, కొందరు క్షేత్రస్థాయి అధికారులు ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిష్కరించాల్సిన అధికారులు డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు రావడం శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్టేషన్ బెయిల్, సివిల్ వివాదాలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాల్లో అక్రమలి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని, నిర్ధారణకు సంబంధిత దర్యాప్తు ఫలితాలు కీలకమని అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**సీసీ కెమెరాల అమలుపైనా ప్రశ్నలు..**

పోలీస్‌స్టేషన్లలో పారదర్శకత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పర్యవేక్షణకు సంబంధించిన న్యాయపరమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటి అమలు తీరుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎస్సై గదులు, విచారణ గదులు తదితర ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం నిఘా వ్యవస్థలు పనిచేసేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులపై మరింత బాధ్యత...**

జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పనితీరుపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని, కిందిస్థాయి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు ప్రతి అధికారి విధి నిర్వహణపై సమీక్ష తప్పనిసరి కావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మహిళల ఫిర్యాదుల విషయంలో




మరింత సున్నితంగా, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మహిళా సంఘాలు సూచిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు రక్షణ, న్యాయం అందించాల్సిన వ్యవస్థలోనే వేధింపులు, అక్రమ వసూళ్ల ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

**అధికారులకు హెచ్చరిక.. శాఖ ప్రతిష్ఠ కాపాడాలి....**

లంచం అడిగినా.. అక్రమ వసూళ్లకు పాల్పడినా.... అధికార దుర్వినియోగానికి పాల్పడినా చర్యలు తప్పవనే స్పష్టమైన హెచ్చరికను పోలీస్ శాఖ నుంచి క్షేత్రస్థాయి సిబ్బందికి ఇవ్వాల్సిన అవసరం ఉంది. అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారు ఏ స్థాయిలో ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థపై నమ్మకం దెబ్బతినకుండా డీజీపీ సీవీ ఆనంద్ ప్రక్షాళన చర్యలు క్షేత్రస్థాయిలోనూ కఠినంగా అమలు కావాల్సిన సమయం ఆసన్నమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రాజంపేట ఎస్సై

- **స్టేషన్ బెయిల్ కోసం డబ్బులు డిమాండ్.**
- **కామారెడ్డిలోని నివాసంలోనే పట్టుకున్న ఏసీబీ అధికారులు**

కామారెడ్డి బ్యూరో/ ఆగస్టు 20/జన సంఘర్షణ

స్టేషన్ బెయిల్ కోసం రూ.30 వేల లంచం డిమాండ్ చేసిన రాజంపేట ఎస్సై ఆంజనేయులు ఏసీబీ అధికారులకు చిక్కారు. కామారెడ్డి పట్టణంలోని తన నివాసంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో పోలీస్ శాఖలో కలకలం రేగింది.

**సిమెంట్ షాపు వివాదంతో మొదలైన వ్యవహారం..**

రాజంపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి సిమెంట్ షాపులో అనుమతి లేకుండా ఓ కంపెనీకి చెందిన సిమెంట్‌ను దించుకున్నాడనే ఆరోపణలతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంపై ఇరువర్గాలపై కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఓ వర్గానికి స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు ఎస్సై ఆంజనేయులు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం.

**పక్కా ప్రణాళికతో రంగంలోకి ఏసీబీ....**

బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రంగంలోకి దిగారు. ఎస్సై సూచన మేరకు బాధితుడు కామారెడ్డిలోని ఆయన నివాసానికి వెళ్లి రూ.30 వేల నగదును అందజేస్తుండగా, అప్పటికే అక్కడ అప్రమత్తంగా ఉన్న ఏసీబీ అధికారులు ఎస్సై ఆంజనేయులును పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. లంచంగా తీసుకున్న నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఎస్సైను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

**పోలీస్ శాఖలో కలకలం....**

ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీస్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటనపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేసే విధానానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులకు హెచ్చరిక.. అవినీతికి తావివ్వొద్దు...**

పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు అధికారాన్ని ప్రజాసేవకు ఉపయోగించాలే తప్ప వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించరాదనే సందేశాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. లంచాలు, అక్రమ వసూళ్లకు పాల్పడే సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏ స్థాయి అధికారి అయినా అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవనే హెచ్చరిక.. ...క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందికి వెళ్లేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం



చేయాల్సిన అవసరం ఉంది.

# మాజీ కాంగ్రెస్ ఎంపీ సజ్జన్ కుమార్ మృతి

- **1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో దోషి..**
- **తిహార్‌లో జీవిత ఖైదు అనుభవిస్తుండగా కన్నుమూత**

న్యూఢిల్లీ, /ఆగస్టు 20/జన సంఘర్షణ/

1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో దోషిగా తేలిన మాజీ కాంగ్రెస్ ఎంపీ సజ్జన్ కుమార్ (80) గురువారం మృతి చెందారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించినట్లు సమాచారం. ఆయన మరణానికి గల కారణాన్ని ఆసుపత్రి వర్గాలు అధికారికంగా వెల్లడించలేదు.

**అల్లర్ల కేసుల్లో జీవిత ఖైదు...**

1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశవ్యాప్తంగా సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. ఢిల్లీలో జరిగిన హింసకు సంబంధించి సజ్జన్ కుమార్‌పై పలు కేసులు నమోదయ్యాయి. ఐదుగురు సిక్కుల హత్య, గురుద్వారాకు నిప్పుపెట్టిన ఘటనకు సంబంధించిన కేసులో ఢిల్లీ హైకోర్టు 2018 డిసెంబర్‌లో సజ్జన్ కుమార్‌కు జీవిత ఖైదు విధించింది. అనంతరం మరో అల్లర్ల కేసులో 2025లోనూ ఆయనకు జీవిత ఖైదు శిక్ష విధించబడింది.

**మూడుసార్లు ఎంపీగా.....**

సజ్జన్ కుమార్ ఔటర్ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున మూడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికయ్యారు. 1980, 1991, 2004లో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 2018లో దోషిగా తేలిన అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

**మరోసారి చర్చనీయాంశంగా 1984 అల్లర్ల కేసులు**

సజ్జన్ కుమార్ మరణంతో దశాబ్దాలుగా దేశ రాజకీయాలను కుదిపేసిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. రాజకీయ ప్రస్థానం నుంచి కోర్టు తీర్పులు, జీవిత ఖైదు వరకు సాగిన ఆయన ప్రయాణం దేశ రాజకీయ చరిత్రలో వివాదాస్పద అధ్యాయంగా నిలిచింది.



# ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీల ఏర్పాటు కోసం సభ...

- **పోతంగల్ మండలాల్లో ఆగస్టు 22న సమావేశాలు...**

పోతంగల్/, ఆగస్టు 20/ (జన సంఘర్షణ):




మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్‌పీ) కోటగిరి, పోతంగల్ మండలాల నూతన కమిటీల ఏర్పాటు కోసం ఈ నెల 22వ తేదీన ప్రత్యేక సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ముసాయిపేట యాదగిరి మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సాంపూర్ కె. పోచిరాం మాదిగ పాల్గొననున్నారు. కోటగిరి మండలంలో ఉదయం 10:30 గంటలకు పోతంగల్ మండలంలో మధ్యాహ్నం 12:30 గంటలకు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కోటగిరి–పోతంగల్ మండల ఇన్‌చార్జిలుగా నేరెళ్ల అశోక్ మాదిగ, పెస లాలయ్య, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల్లో అనక్కెవార్ హరిదాస్ మాదిగ, కన్నం శ్రీనివాస్, జైకత్తె సాయినాథ్ మాదిగ, పొంసెట్టి (పండు) తదితరులు సమన్వయం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కోటగిరి–పోతంగల్ మండలాల నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు

- **2019 ఇంటర్ ఫలితాల అవకతవకలపై విచారణ..**
- **మాజీ సెక్రటరీ అశోక్‌ను ప్రశ్నించిన అధికారులు**

హైదరాబాద్,/ ఆగస్టు 20/జన సంఘర్షణ




తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించారు. 2019లో వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చిన అవకతవకలపై దర్యాప్తులో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. 2019 ఇంటర్ ఫలితాల సమయంలో విద్యార్థుల మార్కుల కేటాయింపు, ఫలితాల ప్రక్రియ తదితర అంశాలపై అప్పట్లో తీవ్ర వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్పటి వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు, పత్రాలు, ఇతర వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**మాజీ సెక్రటరీని ప్రశ్నించిన అధికారులు**

సోదాల్లో భాగంగా ఇంటర్మీడియట్ బోర్డు మాజీ సెక్రటరీ అశోక్‌ను అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. 2019 ఫలితాల సమయంలో తీసుకున్న నిర్ణయాలు, బోర్డులో జరిగిన పరిపాలనా వ్యవహారాలు, సంబంధిత రికార్డులపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

**రికార్డుల పరిశీలన.. విచారణ కొనసాగింపు**

విజిలెన్స్ అధికారులు బోర్డు కార్యాలయంలోని సంబంధిత విభాగాల్లో పలు రికార్డులు, ఫైళ్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. గతంలో జరిగిన ఫలితాల ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారా? బాధ్యత వహించిన అధికారులు ఎవరు? తదితర అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంపై తాజాగా మళ్లీ విజిలెన్స్ దర్యాప్తు వేగం పుంజుకోవడంతో ఇంటర్మీడియట్ బోర్డు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భిర్కూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

- **41 మందికి కంటి పరీక్షలు.. ఆరుగురికి శస్త్రచికిత్స అవసరం..**

భిర్కూర్, /ఆగస్టు 18/ (జన సంఘర్షణ):




భిర్కూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 41 మంది పేషెంట్లకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఆరుగురికి కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వారిని తదుపరి చికిత్స, ఆపరేషన్ కోసం బోధన్ లయన్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలను... అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇటువంటి వైద్య శిబిరాలు నిరంతరం నిర్వహిస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు సతీష్, లయన్స్ జోన్ చైర్మన్ సితలె రమేష్..., కార్యదర్శి గాండ్ల సాయి కృష్ణ, లయన్స్ సభ్యులు మేరూ భరత్, గ్రామ యువకులు లక్ష్మణ్, సతీష్ యాదవ్తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. “కంటి చూపు కాపాడటం కంటే గొప్ప సేవ మరొకటి లేదు” అనే సందేశాన్ని చాటుతూ నిర్వహించిన ఈ శిబిరం గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలిచింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
21 ఆగస్టు 2026

# రూ.20 లంచం కేసులో 30 ఏళ్ల తర్వాత ఊరట...

- కేవలం నగదు స్వాధీనం ఆధారంగా లంచం నిర్ధారించలేం.. క్లర్క్, ప్యూన్‌కు సుప్రీంకోర్టు విముక్తి...

న్యూఢిల్లీ/, ఆగస్టు 20/జన సంఘర్షణ/



మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న రూ.20 లంచం కేసులో గుజరాత్ ప్రభుత్వానికి చెందిన ఓ క్లర్క్, ప్యూన్‌కు ఎట్టకేలకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 1996లో నమోదైన ఈ కేసులో దిగువ కోర్టులు, గుజరాత్ హైకోర్టు విధించిన శిక్షలను సుప్రీంకోర్టు రద్దు చేసి, ఇద్దరినీ నిర్దోషులుగా ప్రకటించింది.

**ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం లంచం ఆరోపణ....**

1996లో ఓ విద్యార్థికి ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.120 లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు క్లర్క్, ప్యూన్‌పై వచ్చాయి. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులు ట్రాప్ నిర్వహించారు. ప్యూన్ వద్ద రూ.20 నగదు లభించగా, క్లర్క్ వద్ద ఆరోపించిన రూ.100 మాత్రం లభించలేదు.

**ఈ ఆధారాలతో కేసు నమోదు కాగా, సుదీర్ఘ న్యాయపోరాటం కొనసాగింది.**

**స్పష్టమైన ఆధారాలు లేవు...**

కేసును విచారించిన సుప్రీంకోర్టు.. లంచం డిమాండ్ చేసినట్లు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లేవని పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదుదారు ఇచ్చిన వాంగ్మూలంలోనూ పలు భిన్నతలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. కేవలం ప్యూన్ వద్ద రూ.20 నగదు లభించిందనే కారణంతోనే లంచం డిమాండ్, స్వీకరణ రెండూ నిరూపితమైనట్లు భావించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**దిగువ కోర్టుల తీర్పులు రద్దు...**

ఈ నేపథ్యంలో దిగువ కోర్టులు, గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. క్లర్క్, ప్యూన్‌ను నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసు నుంచి విముక్తి కల్పించింది.

**అధికారులకు కీలక సందేశం....**

ఈ తీర్పు అవినీతి కేసుల్లో ఆరోపణలకే పరిమితం కాకుండా, లంచం డిమాండ్ చేసినట్లు, స్వీకరించినట్లు చట్టపరంగా స్పష్టమైన ఆధారాలు ఉండాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. అదే సమయంలో అవినీతి ఆరోపణలు ఎదురైనప్పుడు దర్యాప్తు సంస్థలు పకడ్బందీగా ఆధారాలు సేకరించాల్సిన బాధ్యత కూడా ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మూడు దశాబ్దాల న్యాయపోరాటం అనంతరం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పుతో ఊరట లభించడంతో 1996లో మొదలైన ఈ కేసుకు ఎట్టకేలకు తెరపడింది.

# ఆదాయానికి మించి ఆస్తులు.. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఇళ్లలో ఏసీబీ సోదాలు

- 15 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు..
- భారీగా అక్రమ ఆస్తులు ఉన్నట్లు అనుమానాలు....

హైదరాబాద్/, ఆగస్టు 20/జన సంఘర్షణ



ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ శాఖకు చెందిన అధికారి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు....**

శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. మహేశ్వరం తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ఆయన అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం.అధికారులు ఆయనకు సంబంధించిన స్థిర, చర ఆస్తులు, ఆస్తుల కొనుగోలు పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఇతర ఆర్థిక వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**భారీగా ఆస్తులు ఉన్నాయా?....**

సోదాల్లో పలు కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. అయితే సోదాలు పూర్తయి, అధికారికంగా వివరాలు వెల్లడించే వరకు ఆస్తుల విలువ, స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**అధికారులకు హెచ్చరిక.. అక్రమ ఆస్తులపై నిఘా....**

ప్రజాసేవలో ఉన్న అధికారులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవనే సందేశాన్ని వరుస ఏసీబీ దాడులు స్పష్టం చేస్తున్నాయి. అవినీతి, అక్రమ ఆస్తులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.అయితే శ్రీనివాస్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఏసీబీ సోదాలు పూర్తయిన అనంతరం అధికారులు వెల్లడించే వివరాల ఆధారంగానే ఆస్తుల పరిమాణం, అక్రమతలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పోచారం వర్సెస్ ఏనుగు వర్గాల మధ్య పోరు

- నువ్వా నేనా..? బాన్సువాడ కాంగ్రెస్‌లో ఆధిపత్య సమరం...

కామారెడ్డి బ్యూరో/, ఆగస్టు 20 /(జన సంఘర్షణ):





కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. సుదీర్ఘకాలంగా బాన్సువాడ రాజకీయాల్లో తనదైన ఆధిపత్యాన్ని కొనసాగించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి మధ్య విభేదాలు బహిరంగ పోరుగా మారుతున్నాయి. తాజాగా నిజామాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యక్రమం సందర్భంగా ఏనుగు వర్గం చేపట్టిన ఆందోళనతో రెండు వర్గాల మధ్య ఉన్న విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

**నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు...**

1994లో తొలిసారి టీడీపీ తరఫున బాన్సువాడ నుంచి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనంతరం గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల మంత్రిగా, శాసనసభాపతిగా కీలక బాధ్యతలు చేపట్టారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిపై విజయం సాధించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్ది నెలలకు పోచారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బాన్సువాడ రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. పోచారం వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, మరోవైపు పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏనుగు రవీందర్‌రెడ్డి వైపు నిలిచారు.

**ఒకే పార్టీలో రెండు వర్గాలు...**

పోచారం కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బాన్సువాడలో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిందనే చర్చ మొదలైంది. పోచారం వర్గంలో ఆయన వెంట వచ్చిన బీఆర్ఎస్ నాయకులు ఉండగా.. ఏనుగు వర్గంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోసిన పాత నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. పార్టీలో చేరిన కొత్త నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ, పాత కాంగ్రెస్ శ్రేణులను విస్మరిస్తున్నారనే ఆరోపణలను ఏనుగు వర్గం చాలాకాలంగా చేస్తోంది.

**ఏనుగు రవీందర్‌రెడ్డి దూకుడు...**

బాన్సువాడలో పోచారం ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో తన రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. బీర్కూర్ తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానం వద్ద బాన్సువాడలోనే ఉండి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ప్రమాణం చేసినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. అనంతరం నస్రుల్లాబాద్‌లో క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఇటీవల కొంతకాలం అనారోగ్య కారణాలతో రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం తిరిగి నియోజకవర్గంలో తన బలాన్ని పెంచుకునేందుకు ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రయత్నాలు వేగవంతం చేసినట్లు సమాచారం.

**పోచారం వ్యాఖ్యలతో మళ్లీ రగడ..**

ఇటీవల బీర్కూర్ చెక్‌డ్యామ్ వద్ద జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కొత్త దుమారానికి కారణమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులపై విమర్శలు చేయడాన్ని ఏనుగు వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. తమ పార్టీ ప్రభుత్వంపైనే విమర్శలు చేయడమేంటంటూ ఏనుగు వర్గం పోచారంపై మండిపడింది. ఈ వ్యవహారం బాన్సువాడ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలను మరింత పెంచినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**1,500 మంది కార్యకర్తలతో నిరసన..**

బుధవారం నిజామాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి మంత్రి సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై ఫిర్యాదు చేసేందుకు ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన సుమారు 1,500 మంది నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. సమావేశం అనంతరం తమతో మాట్లాడతామని పీసీసీ అధ్యక్షుడు చెప్పినప్పటికీ, తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన ఏనుగు వర్గీయులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. “పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలి” అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

**పాత కాంగ్రెస్ శ్రేణులకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ డిమాండ్..**

పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారని ఏనుగు వర్గం ఆరోపించింది. తనతో పాటు కాంగ్రెస్‌లోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఏనుగు వర్గం ఆందోళనపై మహేష్‌కుమార్ గౌడ్ స్పందించి, పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగినట్లు తెలుస్తోంది.

**బాన్సువాడలో ఇక ‘నువ్వా నేనా?’..**

ఒకవైపు సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఎమ్మెల్యే హోదాతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన రాజకీయ పట్టును కొనసాగించేందుకు ప్రయత్నిస్తుండగా.. మరోవైపు పాత కాంగ్రెస్ శ్రేణుల మద్దతుతో ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం తన బలాన్ని పెంచుకునేందుకు సిద్ధమవుతోంది. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఇవ్వాలి.. పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదనే సంకేతాన్ని ఏనుగు వర్గం తాజా నిరసనతో ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు ఈ రెండు వర్గాల మధ్య విభేదాలను పార్టీ అధిష్ఠానం ఎంత త్వరగా పరిష్కరిస్తుంది? బాన్సువాడలో కాంగ్రెస్ ఆధిపత్యం ఎవరి చేతుల్లోకి వెళ్తుంది? అనే అంశాలు ఇప్పుడు రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# రియాద్ జైలులో బోధన్ యువకుడి నరకయాతన....

- రెండేళ్లుగా జైలులోనే.. విడుదలకు రూ.84 లక్షల ‘బ్లడ్ మనీ’....
- దివ్యాంగ భార్య, చంటి బిడ్డతో కన్నీటి వేడుకోలు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకోవాలని విజ్ఞప్తి...

బోధన్, /ఆగస్టు 20/ (జన సంఘర్షణ):



పొట్టకూటి కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన బోధన్ నియోజకవర్గానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదం కేసులో గత రెండేళ్లుగా రియాద్ జైలులో మగ్గుతున్నాడు. కోర్టు తీర్పు ప్రకారం బాధిత కుటుంబానికి 3.30 లక్షల సౌదీ రియాల్స్ (సుమారు రూ.84 లక్షలు) ‘బ్లడ్ మనీ’గా చెల్లించాల్సి రావడంతో, అంతటి భారీ మొత్తాన్ని సమకూర్చుకోలేక అతడి కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది.

**కుటుంబ పోషణ కోసం విదేశాలకు...**

సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రామయ్య, రాజమణి దంపతుల కుమారుడు శ్రావణ్‌కుమార్ (22) కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలనే ఉద్దేశంతో సౌదీ అరేబియాలోని రియాద్‌కు వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ మెడికల్ రీసెర్చ్ సంస్థలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదం కేసు అతడి జీవితాన్ని ఒక్కసారిగా మార్చేసింది. కేసులో కోర్టు తీర్పు అనంతరం శ్రావణ్‌కుమార్ జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

**దివ్యాంగ భార్య.. చంటి బిడ్డతో కన్నీటి పర్యంతం...**

శ్రావణ్‌కుమార్‌కు చింతల్‌పేట్‌కు చెందిన దివ్యాంగురాలు మమతతో వివాహం జరిగింది. భర్త జైలులో ఉండటంతో కుటుంబ భారాన్ని మోస్తున్న మమత చంటి బిడ్డతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. భర్తను ఎలాగైనా జైలు నుంచి విడిపించి స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ సహాయం కోసం వేడుకుంటోంది. రూ.84 లక్షల బ్లడ్ మనీ చెల్లించే స్థోమత తమ కుటుంబానికి లేదని, ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కన్నీటితో కోరుతున్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలి...**

విదేశీ జైలులో చిక్కుకున్న తెలంగాణ యువకుడి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా న్యాయపరమైన, దౌత్యపరమైన సహాయం అందించాలని కోరుతున్నారు. అదేవిధంగా అవసరమైన బ్లడ్ మనీ సమీకరణకు ప్రభుత్వ స్థాయిలో సాధ్యమైన సహాయం అందించడంతో పాటు, దాతలు, ప్రవాస తెలంగాణ సంఘాలు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఒక కుటుంబం కన్నీటికి ప్రభుత్వం అండగా నిలవాలి...**

కుటుంబాన్ని పోషించేందుకు విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు రెండేళ్లుగా జైలు జీవితం గడపడం, అతడి భార్య దివ్యాంగురాలై చంటి బిడ్డతో ఒంటరిగా మిగలడం విషాదకర పరిస్థితికి అద్దం పడుతోంది.“మా భర్తను.. మా బిడ్డ తండ్రిని ఎలాగైనా స్వదేశానికి తీసుకురావాలి. రూ.84 లక్షలు చెల్లించే స్థోమత మాకు లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి” అని మమత వేడుకుంటోంది. బాధిత కుటుంబం పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో సంబంధిత శాఖలు, కేంద్ర ప్రభుత్వం, సౌదీ అధికారులతో సమన్వయం చేసి శ్రావణ్‌కుమార్ విడుదలకు మార్గం చూపాలని బోధన్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co